# రవీంద్రనాథ్ ఠాగూర్

# గీతాంజలి

---

# తరణి

---

# రవి కిరణాలు

సాహితి

# గీతాంజలి

## 1

**నీ**వు నన్ను అనంతంగా సృష్టించావు. అది నీ విలాసం. తాకితే చాలు, పగిలిపోయే యీ పాత్రికను నీవు మాటి మాటికీ ఖాళీచేసి మళ్ళీ కొత్త జీవితంతో నింపుతూ వుంటావు. ఈ చిన్ని వేణువును ఊదుతూ కొండలూ, కోనలూ తిరుగుతావు. నిత్య నూతనమైన మధురగీతాలు ఆలపిస్తావు.

నీ మృదుల కరాల అమృత స్పర్శ సోకితే చాలు, నా చిన్నారి గుండెలో ఆనందం పరుగులు తీస్తుంది. ఏవో మాటలు నాలో పెల్లుబుకుతాయి.

నీవు యిచ్చే మహాప్రసాదాన్ని స్వీకరించాలంటే– చూడు– నా చేతులెంత చిన్నవో, ఈ చిన్ని చేతులతో ఆ మహాప్రసాదాన్ని స్వీకరించగలనా?

ఇలాగ యుగాలు గడిచిపోతాయి. అయినా నీవు కొత్తజీవితాన్ని పాడుతూనే వుంటావు. కొత్తపాటలు పాడుతూనే వుంటావు. అయినప్పటికీ మళ్ళీ యీ పాత్రికను నింపడానికి ఖాళీ వుంటుంది.

## 2

నీవు నన్ను పాట పాడమని ఆజ్ఞాపించావు.

అప్పుడు నా హృదయం ఎంత పొంగిపోయిందనుకున్నావు? నన్ను కదా నీవు పాట పాడమని అడిగావనే గర్వంతో నా హృదయం పగిలిపోయిందేమో నని అనిపించింది. అప్పుడు నీ ముఖంవైపు చూచాను. నా కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

నా బ్రతుకులోని అపస్వరాలన్నీ కరిగి ఒక కమ్మని మధుశ్రుతిలో లీనమై నాయి. నాలోని పూజాభావం హాయిగా ఏ చింతా లేకుండా సాగరంపై ఎగురుతూ వెళ్లే పక్షిలాగా రెక్కలు చాచింది.